
# నియోజకవర్గ ఓటర్లు @ 5,52,362

- ఐదేళ్లలో పెరిగిన 1 లక్షా 11వేల 357 ఓట్లు
- కొనసాగుతున్న ఆన్‌లైన్ ఓటరు నమోదు

మణికొండ, అక్టోబర్ 12 : ఎన్నికల షెడ్యూల్ ఖరారు కావడంతో అధికార యంత్రాంగం ఎన్నికల ప్రక్రియను సజావుగా పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టింది. ఎన్నికల నిర్వహణలో అత్యంత కీలకమైన ఓటరు జాబితా ప్రాథమిక నివేదికను రెవెన్యూ డివిజనల్ అధికారి మల్లయ్య గురువారం వెల్లడించారు. ఐదేళ్ల క్రితం రాజేంద్రనగర్ నియోజకవర్గ ఓటర్ల సంఖ్యకు మించి 1 లక్షా 11 వేల 357 ఓట్లు ప్రస్తుతానికి పెరిగాయని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని గండిపేట, రాజేంద్రనగర్, శంషాబాద్ మండలాల పరిధిలోని మున్సిపాలిటీలు, గ్రామాలు అన్ని కలిపి తాజా ఓటరు జాబితా 5,52,362కు చేరిందన్నారు. వీరిలో పురుషులు 2,88,270 మంది ఉండగా, మహిళా ఓటర్లు 2,64,053 మంది, ఇతరులు 39 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. గడిచిన ఐదేళ్ల క్రితం సార్వత్రిక ఎన్నికలలో రాజేంద్రనగర్ నియోజకవర్గం మొత్తం 4,41,005 మంది ఉండగా, వీరిలో పురుషులు 2,33,048, మహిళా ఓటర్లు 2,07,881 మంది, ఇతరులు 76 ఓటర్లు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మొత్తం ఓట్లల్లో 56.89శాతం గత సార్వత్రిక ఎన్నికలలో పోలవగా అంటే 2,50,934 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. నూతనంగా ఓటరు నమోదు చేసుకునేందుకు ఈనెల 31 వరకు ఆన్‌లైన్ ద్వారా ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. తుది ఓటరు ముసాయిదా వెలువరించే నాటికి మరో పదివేల ఓట్లు కొత్తగా నమోదయ్యే అవకాశాలున్నాయని ఆర్డీవో తెలిపారు. షెడ్యూల్ ప్రక్రియ మొదలైందని, ఎన్నికల నియమావళికి లోబడి నిర్వహణ కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఎక్కడైనా నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలకు బాధ్యులు అవుతారని ఆయన సూచించారు.


రాజేంద్రనగర్ నియోజకవర్గం మ్యాపు

## ఎన్నికల నిబంధనలు పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఉప కమిషనర్ రవికుమార్

బండ్లగూడ,అక్టోబర్ 12: ఎన్నికల నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లయ్య పేర్కొన్నారు. రాజేంద్రనగర్ ఆర్డీవో కార్యాలయంలో గురువారం ఉప కమిషనర్ రవి కుమార్‌తో కలిసి వివిధ రాజకీయతో నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మలయ్య మాట్లాడుతూ రాజకీయ నాయకులు అందరూ తప్పని సరిగా ఎన్నికల నియామవళిని పాటించాలన్నారు.తమ బస్తీలలో ఓటర్ల పేర్లను పరిశీలించాలని సూచించారు.పేర్లు లేక పోతే 30 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## బతుకమ్మ సంబురాలు



మణికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసికట్టుగా బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తీసుకువచ్చిన బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సంబురాలు జరుపుకున్నారు. మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్ రామ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీరాములు,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. –మణికొండ,అక్టోబర్ 12

## చైన్‌స్నాచింగ్ దొంగలు అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ లక్ష్మీనారాయణ, ఇన్‌స్పెక్టర్ శివకుమార్

మణికొండ,అక్టోబర్ 12 : పక్కా దొంగతనాలే వారి వృత్తిగా అలవర్చుకున్నారు. ఇప్పటికే పలుమార్లు దొంగతనాల కేసుల్లో ప్రధాన నిందితులు...అనేక పర్యాయయాలు జైలులో ఊచలు లెక్కబెట్టారు.. అయినా బుద్ధి మారకపోవడంతో ఒకరిపై రౌడీషీటర్ కేసును సైతం పోలీసులు నమోదు చేశారు. తిరిగి మళ్లీ అవే దొంగనాలను వినూత్న రీతిలో ఒంటరిగా ఉన్న వ్యక్తులను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగల ముఠాను నార్సింగి క్రైం పోలీసులు గురువారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. నార్సింగి ఏసీపీ లక్ష్మీనారాయణ విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. నార్సింగిలోని సాయిబాబ దేవాలయం సమీపంలో నివాసముంటున్న కోయిలకొండ అంజయ్య సెప్టెంబర్ 25న మూత్రవిసర్జన కోసం బయటకు వెళ్లగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి అతడి మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసును అపహరించుకుని వెళ్లిపోయారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఈనెల 11న హైదర్షాకోట్ గ్రామం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను నార్సింగి క్రైం పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించగా దొంగతనం చేసింది తామేనంటూ ఒప్పుకున్నారు. వీరి వద్ద నుంచి రెండు తులాల బంగారు గొలుసు, ఓ బైక్, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఏసీపీ లక్ష్మీనారాయణ తెలిపారు. నిందితులలో ఒకరైన సయ్యద్ అబ్బాస్ అలియాస్ మోహతాబ్ అలియాస్ సయ్యద్ బ్రాండ్‌పై రౌడీషీట్ కేసు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మరో నిందితుడు తుమకుటి వినాయక్‌రెడ్డి ప్రేమ్‌నగర్ కాలనీ, హఫీజ్‌పేట, మియాపూర్ ప్రాంతంగా నివాసముంటూ పలు కేసుల్లో దొంగతనాలు, ఇళ్లల్లో సెల్‌ఫోన్ల దొంగతనాలు, పటాన్‌చెరువు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక రాయల్ ఎన్‌ఫీల్డ్‌ను, మోటార్ సైకిల్‌ను దొంగిలించిన కేసులో నిందితుడు. చైన్‌స్నాచింగ్ కేసును ఛేదించిన క్రైం పోలీసుల బృందాన్ని ఏసీపీ లక్ష్మీనారాయణ అభినందించి రివార్డులను అందజేశారు.

## ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేయండి


అధికారులకు సుచనలు చేస్తున్న డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి

బండ్లగూడ,అక్టోబర్ 12: ఎన్నికల నేపథ్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో తనిఖీలను ముమ్మరం చేయాలని రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. రాజేంద్రనగర్ ఆర్డీవో కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి మలయ్య అధ్యక్షతన వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి విచ్చేసి అధికారులకు తగిన సుచనలను చేశారు.ఎన్నికల కోడ్ వచ్చి మూడు రోజులు గడుస్తున్నందున ఎన్నికల నిబంధనలను పాటించేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని చెక్‌పోస్టులతో పాటు అనుమానం వచ్చిన వాహనాలను కూడా తనిఖీలు చేయాలన్నారు. యాభై వేల కంటే ఎక్కవ డబ్బును తరలిస్తే వాటికి తగిన ఆధారాలు చూపని పక్షంలో ఆ డబ్బులను ట్రెజరీకి అప్పగించాలన్నారు. పది లక్షల రూపాయల కంటే ఎక్కువ డబ్బులు ఉంటే ఇన్‌కం టాక్స్ అధికారులకు అప్పగించాలని తెలిపారు. రాజకీయ నాయకులకు దూరంగా ఉంటు ఎన్నికల విధులను నిర్వహించాలని తెలిపారు.ఎక్కడ ఎలాంటి సంఘటనలు జరిగిన వెంటనే రిటర్నింగ్ అధికారికి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి గంగాధర్, తహసీల్దార్‌లు, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ఎంపీపీ జయమ్మశ్రీనివాస్, జడ్పీటీసీ తన్విరాజు

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 12: సమస్యల పరిష్కారం కోసమే సమావేశాలు నిర్వహిస్తున్నట్లు శంషాబాద్ ఎంపీపీ జయమ్మశ్రీనివాస్ తెలిపారు. గురువారం శంషాబాద్ మండల సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ జయమ్మశ్రీనివాస్, జడ్పీటీసీ తన్విరాజు మాట్లాడుతూ ప్రభుత్వం చేపడతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు గ్రామాల్లో అమలు చేస్తున్న తీరుపై చర్చించి వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయడం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పథకాల పనితీరుపై వివరించారు. వ్యవసాయ, విద్యుత్, రెవెన్యూ, పంచాయతీరాజ్, తాగునీరు, ఆరోగ్యశాఖ, ఇంజినీరింగ్, రవాణా,ఆర్‌అండ్‌బీ,సాగునీటిపై చర్చించారు. వివిధ సమస్యలపై ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. గ్రామాలలో విద్యుత్, రెవెన్యూ సమస్యలపై సర్పంచ్‌లు ప్రశ్నించారు. పెద్దషాపూర్ ఎంపీటీసీ చెక్కల ఎల్లయ్య ముదిరాజ్, సర్పంచ్‌లు రాంగోపాల్, చంద్రశేఖర్ తదితరులు వివిధ సమస్యలపై అధికారులను నిలదీసిన వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన ఎంపీపీ జయమ్మ శ్రీనివాస్, జడ్పీటీసీ తన్విరాజు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు అడుగుతున్న సమస్యలపై విద్యుత్‌శాఖ అధికారులు వచ్చే సమావేశంలోపు కాచారం, కేబిదొడ్డి, సుల్తాన్‌పల్లితో పాటు ఆయా గ్రామాల్లో విద్యుత్ సమస్య పూర్తిగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎంపీడీవో వసంతలక్ష్మి, వైస్‌ఎంపీపీ నీలంనాయక్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయులకు సన్మానం



శంషాబాద్‌లోని తొండుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేసిన యాదయ్యను స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తొండుపల్లి పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో యాదయ్యతో పాటు కొత్తగా వచ్చిన ప్రధానోపాధ్యాయుడు మధుకర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బక్క రత్నం, బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, పరమేశ్‌గౌడ్ పాల్గొన్నారు. –శంషాబాద్ రూరల్, అక్టోబర్ 12 :

## మెరిట్ స్కాలర్‌షిప్‌నకు విద్యార్థుల ఎంపిక

బండ్లగూడ,అక్టోబర్ 12: రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎర్ర అంజయ్య తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి అత్యుత్తమ ర్యాంకులను సాధించడంతో వారు నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ స్కాలర్ షిప్ ద్వారా వీరికి డిగ్రీ చదువుతున్నపుడు రూ. 10వేల చొప్పున మూడు సంవత్సరాలకు రూ. 30 వేలు ,తర్వాత పీజీ చదివేటప్పుడు రెండు సంవత్సరాలకు గాను రూ. 20వేల చొప్పున రూ. 40వేలు వస్తాయన్నారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు ఆయన అభినందించారు.

## శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 12: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాటేదాన్ టీఎన్‌జీవోస్ కాలనీలోని శ్రీశ్రీశ్రీ దుర్గా భవానీ మాత దేవాలయంలో ఈ నెల 15వ తేదీ నుంచి దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గురువారం దేవాలయం ఆవరణలో మహోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 15వ తేదీ నుంచి 23 వరకు ఈ ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఈ నెల 15న శ్రీ బాలా త్రిపుర సుందరి, 16న గాయత్రీ దేవి, 17న అన్నపూర్ణదేవి, 18న లలితదేవి, 19న మహాలక్ష్మిదేవి, 20న మహా సరస్వతి దేవి, 21న గౌరీ దేవి, 22న దుర్గా భవానీ మాత, 23న మహిషాసుర మర్ధిని దేవి, రాజరాజేశ్వరి దేవి రూపంలో అమ్మవారు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం దేవీ అవతరాలు, అభిషేకాలు, సాయంత్రం మహా హారతి, నీరాజనం, మంత్ర పుష్పం, మహాప్రసాద వితరణ నిర్వహించనున్నారు. భక్తులు ఈ పూజల్లో అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.